సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

పరదేశమ్మ ఉత్సవాలు ప్రారంభం

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురంలో సోమవారం తొలేళ్లతో పరదేశమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అమ్మవారి ప్రతిమలైన ఘటాలను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం రథాల ఉత్సవం, బుధవారం ముగింపు ఉత్సవం నిర్వహించనున్నారు.

ఘనంగా శివ పార్వతుల విగ్రహాల పునఃప్రతిష్ట



మద్ది రామాలయంలో ప్రతిష్ఠించిన శివ పార్వతుల విగ్రహాలు

పద్మనాభం: మండలంలోని మద్ది రామాలయంలో సోమవారం శివ పార్వతుల విగ్రహాల పునఃప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకుడు సీతారామాచారి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం శివ పార్వతుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, అధిక సంఖ్యలో భక్తుల పాల్గొన్నారు.

తల్లీబిడ్డ అదృశ్యం

పీఎం పాలెం: కుమార్తెతో కలిసి తల్లి అదృశ్యంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదయింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... బోయిపాలెం స్వచ్ఛభారత్ నగర్‌లో గండికోట రాంబాబు, భార్య భవాని, రెండు నెలల పాపతో నివసిస్తున్నారు. అదే ఇంట్లో అత్త మామలు కూడా ఉంటున్నారు. రాంబాబు ఫార్మా కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ నెల 13న ఉదయం రాంబాబు డ్యూటీకి, అత్తమామ కూలి పనులకు వెళ్లిపోయారు. వారు సాయంత్రం వచ్చేసరికి ఇంటి వద్ద భవాని, ఆమె కుమార్తె కనిపించలేదు. ఇంటికి తాళం వేసి, ఫోన్ స్విచ్ఆఫ్ చేసి వుంది. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యార్థుల శ్రమదానం

ఆనందపురం : మండలంలోని గిడిజాలలో సోమవారం విద్యార్థులు శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. శొంఠ్యాం పంచాయతీ మిందివానిపాలెంలోని విశ్వనాథ ఫార్మా స్యూటికల్స్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గిడిజాలలో సేవా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల, దేవాలయ ప్రాంగణాలను విద్యార్థులు శుభ్రపరిచి చెత్త తొలగించారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో సర్వే చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.సమన్వయి పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన యువకుడితో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతుండగా యువకుడిని లైఫ్‌గార్డ్స్ కాపాడారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇవీ. పార్వతీపురం ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు సోమవారం సాయంత్రం సరదాగా గడిపేందుకు రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు స్నేహితులంతా సరదాగా గడిపి బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా వుండడంతో వారిలో గంటా మనోహర్ అనే యువకుడు కొట్టుకుపోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ సూరాడ నూకరాజు, చిన్నప్పన్న, ఎం.అమ్మోరు, చందు, సతీష్ గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వీరికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9493185214

సంక్షేమ పాలనకు ఓటేయండి



ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- ఉత్తరాంధ్ర అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు హారతిస్తున్న మహిళలు

ఆనందపురం : పేదల పక్షపాతిగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి, నీతివంతమైన పాలన అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరలా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మామిడిలోవలో సోమవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తూ సాగించిన సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన చరిత్రలో నిలిచి పోతుందన్నారు. అర్హత ఉన్నప్పటికీ ఏ పథకమూ అందుకోలేని దుస్థితి టీడీపీ పాలనలో ఉండేదన్నారు. సిఫార్సులకు, లంచాలకు చెక్ పెట్టి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని చెప్పారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశేష కృషి చేశారని చెప్పారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని వెనుకబాటుతనం పోయి పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధించాలన్నా, విశాఖపట్నాన్ని రాష్ట్ర రాజధానిగా చేసుకోవాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. కరోనా సమయంలో రాష్ట్ర ఆదాయం పూర్తిగా పడిపోయినా సంక్షేమ పథకాలను మాత్రం ఎక్కడా ఆపలేదని గుర్తు చేశారు. అధికార దాహంతో చంద్రబాబు నాయుడు మరలా ఎన్నికల ముందు మహిళలకు కిలో బంగారం, పురుషులకు బెంజ్‌కార్లు ఇస్తామని మభ్యపెడతారని విమర్శించారు. అలాంటి వారి వల్లే రాష్ట్రం చాలా వెనుకబడిపోయిందని ప్రజలు గుర్తించుకోవాలన్నారు. మహిళలకు రుణమాఫీ, సున్నా వడ్డీ రుణాలని మోసం చేశారని గుర్తు చేశారు. ఎన్నడూ లేని విధంగా ఆనందపురం మండలంలో రూ.440 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో భీమిలి ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, తాను పడుతున్న కష్టాన్ని, చేస్తున్న సేవలను గుర్తించి మరలా భీమిలిలో పోటీ చేసే అవకాశం జగనన్న ఇచ్చారన్నారు. ప్రజలు మరలా ఆశీర్వదిస్తే రెట్టించిన ఉత్సాహంతో మరింత సేవ చేస్తానని చెప్పారు. అలాగే విశాఖ పార్లమెంటు నియోజకవర్గానికి విద్యావేత్త, స్థానిక బీసీ నేత బొత్స ఝాన్సీలక్ష్మి వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముందుగా గ్రామంలోకి వచ్చిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు అపూర్వ స్వాగతం లభించింది. మహిళలు హారతులతో నీరాజనాలు పట్టారు. మేళతాళాలతో ఊరేగింపుగా సీతారాములు, ఆంజనేయ స్వామి దేవాలయాలకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, నాయకులు బంటుబిల్లి మణిశంకర నాయుడు, కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, నాయకులు బలిరెడ్డి మహేష్, డోల దేవుడు, గొరపల్లి సత్యనారాయణ, పాండ్రంకి అప్పారావు, పిన్నింటి వెంకట రమణ, బొట్టా రామకృష్ణ, గంట్రెడ్డి శ్రీనివాస్, డోల ఆనంద్, నాగేశ్వరరావు, బీఆర్‌బీ నాయుడు, లెంక రాంబాబు, రౌతు వెంకటరావు, కోరాడ అప్పలస్వామి నాయుడు, కోరాడ ముసలినాయుడు, లొడగల రమణ, రౌతు శ్రీను, జిన్నాల వెంకట రమణ, చందక అప్పలస్వామి, ఇల్లాపు వెంకటరావు పాల్గొన్నారు.



దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



దిబ్బమీదపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

24 నుంచి ముగ్గురు అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవాలు



పోలమాంబ, ముత్యమాంబ, మరిడిమాంబ అమ్మవార్లు

తగరపువలస : సంగివలస పోలమాంబ (కొత్తమ్మ వారి) ఆలయ వార్షికోత్సవాలు దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈ మూడు రోజులపాటు వేకువజామున 5 గంటలకు అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. మొదటి రోజైన 24న మరిడిమాంబ ఉత్సవం, 25న ముత్యమాంబ, పోలమాంబ అమ్మవార్లకు ఉత్సవాలు నిర్వహిస్తారు. చివరి రోజైన 26న ముగ్గురు అమ్మవార్లకు అనుపోత్సవం నిర్వహిస్తారు. ఈ అనుపోత్సవం రోజు ఆలయం వద్ద పులివేషాలు, తప్పెటగుళ్ల, నవదుర్గ అమ్మవార్ల వేషాలు, బాణసంచా ఏర్పాటు చేశారు.

అలాగే మూడు రోజులపాటు ఆలయ ఆవరణలో సాయంత్రం 7 గంటల నుంచి పౌరాణిక నాటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ నెల 31న ఆలయ ఆవరణలో మహా అన్నదానం నిర్వహించనున్నారు. ప్రత్యేక పూజలు, ఇతర వివరాలకు ఆలయంలో సిబ్బందిని సంప్రదించాలని ఈవో బండారు ప్రసాద్ కోరారు.

సమష్టి కృషితో వైఎస్సార్ సీపీ విజయం



వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు సిద్ధం అంటున్న కార్యకర్తలతో ఎమ్మెల్యే శ్రీనివాసరావు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

కొమ్మాది : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 8వ వార్డు గుడ్లవానిపాలెంలో సోమవారం సాయంత్రం పార్టీ శ్రేణులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తే మన విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పించే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రలోభాలకు గురిచేస్తారని, గమనించాలని సూచించారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను గడప గడపకూ వెళ్లి వివరించాలన్నారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, నాయకులు లొడగల రామ్మోహన్, ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమా మహేశ్వరరావు, ముదుండి రాజేశ్వరి, చెన్నా దాస్, దువ్వి వాసు, భాస్కర్, చిల్లా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎందరు కలిసొచ్చినా వైఎస్సార్‌సీపీదే గెలుపు



మధురవాడ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- పవన్ కల్యాణ్... ఓ పిచ్చి కల్యాణ్
- ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : ఎంత మంది కలిసొచ్చినా.. ఎవ్వరు వచ్చినా భీమిలిలో వైఎస్సార్ సీపీదే విజయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5, 7 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీలు, బూత్ కమిటీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో మధురవాడ, దుర్గానగర్‌లో సోమవారం ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమిలిలో తనపై పోటీ చేయడానికి గంటా శ్రీనివాసరావునే కాదు చంద్రబాబు, పవన్ కల్యాణ్ వచ్చినా ఇక్కడ వైఎస్సార్‌సీపీ జెండానే ఎగురుతుందన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యి విశాఖ నుంచే పరిపాలన సాగిస్తారని దీమా వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయన్నారు. కష్టపడి పనిచేసే వారిని సీఎం జగన్ ఎప్పుడూ గుర్తిస్తారని చెప్పారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా వున్నారని, వారిని బూత్ వద్దకు తీసుకెళ్లి ఓటు వేయించుకునే బాధ్యత మనందరిపైనా వుందన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రజలకు జరిగిన మేలు వివరిస్తూ, ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే వుందన్నారు. ప్రతిపక్షాలు మన కార్యకర్తలను కొనేయవచ్చని తక్కువ అంచనా వేస్తున్నారని, సీఎం జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే మనమంతా గెలిచినట్టేనన్నారు. అందరం కార్యకర్తలమేనని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలన్నారు. కార్యకర్తలను బెదిరించి, ప్రలోభాలకు గురిచేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. పవన్ కల్యాణ్ ఓ పిచ్చి కల్యాణ్ అని, జనసేనలోకి టీడీపీ వారిని చంద్రబాబు పంపించి అక్కడ కూడా అతని మనుషులకే టికెట్లు వచ్చేలా చేసుకుంటున్నాడన్నారు. జనసేనకి ఇచ్చిన సీట్లలో కూడా వారిని గెలవనివ్వడని విమర్శించారు. అనంతరం బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పిళ్లా పాపారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, నాయకులు వంకాయల మారుతీ ప్రసాద్, కుడితి రామారావు, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, జగ్గుపిల్లి నరేష్, వాండ్రాసి రవికుమార్, చేకూరి రజని, పిళ్లా పాపారావు, బంగారు ప్రకాశ్, అల్లాడ లింగేశ్వరరావు పాల్గొన్నారు.

రజకుల నోట్లో టీడీపీ నాయకుల మట్టి

- గోస్తనీ గెడ్డలోకి 'శశి' మురుగు
- విద్యాసంస్థతో టీడీపీ నాయకుల కుమ్మక్కు



తాళ్లవలస పంచాయతీ వలందపేటలో డ్రైనేజీ మురుగుతో నింపేసిన వ్యవసాయ బావి



సంగివలస నుంచి వస్తున్న మురుగునీరు



ఇంటి వద్దే దుస్తులు శుభ్రం చేసుకుంటున్న రజకుడు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వలందపేటలో రజక వృత్తి చేసుకుని జీవనం సాగించే 150 కుటుంబాల నోట్లో అక్కడి టీడీపీ నాయకులు మట్టి కొట్టారు. తాళ్లవలస, తాటితూరు పంచాయతీలు, జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వలందపేట గ్రామాలకు సరిహద్దుగా గోస్తనీ నది గెడ్డ ప్రవహిస్తుంది. ఈ గెడ్డలోనే వలందపేట, సంగివలసకు చెందిన రజకులు దుస్తులు శుభ్రం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఇటీవల భీమిలి మండలం, జోన్‌కు సంబంధించిన టీడీపీ నాయకుల రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, దుర్బుద్ధి కారణంగా రజకుల వృత్తిపైనే దెబ్బ పడింది. వీళ్లు సంగివలస శశి విద్యాసంస్థల యాజమాన్యంతో కుమ్మక్కై జీవీఎంసీలోని ప్రభుత్వ స్థలాల మీదుగా పైప్‌లైన్ వేయించి తాళ్లవలస, తాటితూరు పంచాయతీల నడుమ వ్యవసాయ బావి లోపలికి మురుగు వెళ్లేలా ఏర్పాటు చేయించారు. తాళ్లవలస సర్వే నంబర్ 21/1, 21/2లో ప్రభుత్వ భూమి 2.58 ఎకరాలు వుంది. ఇందులో శ్మశానవాటికతో పాటు, వ్యవసాయబావి, గోస్తనీగెడ్డ ఉన్నాయి. శశి విద్యా సంస్థలు రోజూ మురుగుతోపాటు చెత్త, వ్యర్థాలు పైప్‌లైన్ ద్వారా ప్రవహించి పంచాయతీలో ఉన్న వ్యవసాయ బావిలోకి నేరుగా చేరుతున్నాయి. బావి నిండిన తర్వాత అక్కడి నుంచి వ్యర్థాలు గోస్తనీ గెడ్డలోకి చేరుతున్నాయి.

వ్యవసాయానికి తీవ్ర నష్టం

గోస్తనీ గెడ్డ కలుషితం కావడంతో ఇప్పటికే రజకులు ఇంటివద్దే అష్టకష్టాలు పడి దుస్తులు శుభ్రం చేసుకుంటున్నారు. ఇక వేసవిలో అయితే నీటికొరత కారణంగా మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. గెడ్డను ఆనుకుని వ్యవసాయ భూములు కూడా మురుగు కారణంగా పండటం లేదు. అలాగే పశువులకు తాగునీటి సమస్య తలెత్తింది. మురుగు ఎక్కువైనప్పుడు శ్మశానవాటిక కూడా నిండిపోతుంది. దీనిపై ఇక్కడి రజకులు, రైతులు, ప్రజలు పలుమార్లు 'స్పందన'లో ఫిర్యాదు చేశారు. ఇటీవల తాళ్లవలస పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఇక్కడి పరిస్థితులు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కొందరి దుర్బుద్ధి కారణంగానే ఇక్కడ అన్నివర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పంచాయతీలో మురుగునీరు ప్రవహించకుండా అడ్డుకట్ట వేస్తామన్నారు.

మరో పని చేతకాదు



పూర్వం నుంచి మా రజక వలందపేట వాసులు గోస్తనీ గెడ్డలో శుభ్రమైన నీటిలోనే దుస్తులు శుభ్రం చేసుకునేవారం. ఇప్పుడు గెడ్డలో మురుగు కలుస్తుండడంతో మా ఉపాధికి గండి పడింది. బల్లలన్నీ ఇళ్లకు చేర్చుకున్నాము. మరొకపని చేతకాక పోవడంతో బోర్ల నుంచి కష్టపడి నీరు తెచ్చుకుని బతుకు తెరువు సాగిస్తున్నాం.

– బవిరిశెట్టి సింహాద్రి, వలందపేట

మా పొట్టపై కొట్టారు



ఈ ప్రాంతంలో టీడీపీ నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అవసరాల మేరకు శశి విద్యాసంస్థలకు స్థలం లేకపోయినా దౌర్జన్యంగా జీవీఎంసీ పరిధిలో పైప్‌లైన్ వేయించారు. చివరగా మురుగును వ్యవసాయ బావి తద్వారా గోస్తనీ గెడ్డలోకి మళ్లించారు. నీరు కలుషితం కావడంతో దుస్తులు శుభ్రం చేసే పనులు తగ్గించేశాం. శశి నుంచి మురుగు నీటికి అడ్డు పడితే తప్ప మాకు ఉపాధి కష్టం.

– కళింగపట్నం రాంబాబు, వలందపేట

'పది' పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం

తగరపువలస : పదో తరగతి పరీక్షలు సోమవారం భీమిలి పరిధిలోని 13 కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అనుచిత సంఘటనలు జరగకుండా ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షించారు. వివిధ గ్రామాలు, పాఠశాలల నుంచి తమ పిల్లలను తీసుకొచ్చిన తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు బెస్ట్ ఆఫ్ లక్ తెలియచేసి పరీక్షకు పంపించారు. వారు పరీక్ష రాసి వచ్చేంత వరకు కేంద్రాల వద్ద నిరీక్షించారు. కేంద్రాల్లో నిర్వాహకులు తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు విద్యార్థులు 9 గంటలకే చేరుకుని రూమ్ నంబర్లు చూసుకున్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పాఠశాల యాజమాన్యం, పోలీసులు చర్యలు తీసుకున్నారు.

23 మంది గైర్హాజరు

ఆనందపురం : మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు మొదటి రోజు 23 మంది విద్యార్థులు హాజరుకాలేదు. ఆనందపురం ఏ కేంద్రంలో 240 మందికి 237 మంది, బీ కేంద్రంలో 222 మందికి 212 మంది, బోయిపాలెంలో 200 మందికి 197 మంది, శొంఠ్యాంలో 230 మందికి 226 మంది, పెద్దిపాలెంలో 195 మందికి 192 మంది హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి తెలిపారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు నిర్వహించగా 170 మంది విద్యార్థులు హాజరయ్యారు. సెయింటాన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరగ్గా 247 మంది హాజరయ్యారు.



చిట్టివలస విజ్‌డమ్ జూనియర్ కళాశాల వద్ద రోల్ నంబర్లు సరిచూసుకుంటున్న విద్యార్థులు



పద్మనాభంలో హాల్ టికెట్ పరిశీలిస్తున్న పోలీసు

పద్మనాభం : మండలంలో పదో తరగతి పరీక్షలకు ఒకరు గైర్హాజరయ్యారు. మండలంలోని నాలుగు సెంటర్లలో 694 మందికి 693 మంది హాజరయ్యారు. పద్మనాభం, రెడ్డిపల్లి కేంద్రాలను తహసీల్దార్ ఎస్.వెంకటరావు, ఎంఈవో పి.రమణ సందర్శించారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించారు. ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో పరీక్షల ప్రారంభానికి ముందు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, నాయకులు మరగడ అప్పారావు, సీర సూరప్పడు ఏర్పాట్లు పరిశీలించారు. పోలీసులు గేట్ వద్ద విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలించి కేంద్రాల్లోకి పంపించారు.

మధురవాడ : మధురవాడలోని వివిధ కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కావాల్సి వుండగా 8 గంటలకే కేంద్రాల వద్దకు విద్యార్థులు చేరుకున్నారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు ఇతర కేంద్రాల వద్ద అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.



చంద్రంపాలెం హైస్కూల్‌లో రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



మధురవాడలో పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

లీగల్ డ్రాఫ్టింగ్ కీలకం

కొమ్మాది: న్యాయవాద వృత్తిలో రాణించాలనుకునే వారు లీగల్ డ్రాఫ్టింగ్‌పై పట్టు సాధించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రతిభావంతమైన కేసు రచన, సరళమైన భాషతో చెప్పదలచుకున్న విషయాలు తగిన ఆధారాలతో వుండాలన్నారు. లీగల్ డ్రాఫ్టింగ్‌లో బలమైన అంశాలకు న్యాయస్థానాల్లో ఎంతటి ప్రాధాన్యత వుంటుందో వివరించారు. వివిధ రకాల లీగల్ డ్రాఫ్టింగ్ పద్ధతులు తెలియజేశారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు.

మూల్యాంకనం ప్రారంభం

తగరపువలస : రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 2, 3న జరిగిన టైప్ రైటింగ్ తెలుగు, ఇంగ్లిష్ హయ్యర్, లోయర్ పరీక్షలకు సంబంధించిన మూల్యాంకనం సోమవారం భీమిలిలో ప్రారంభమైంది. ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల డీసీసీపీ విభాగం ఇన్‌చార్జి అనురాధ ఆధ్వర్యంలో మూల్యాంకన మూడు రోజులపాటు జరగనుంది. చిట్టివలసకు చెందిన లక్ష్మి టైప్ ఇన్‌స్టిట్యూట్, విశాఖకు చెందిన రాజా, సూర్య, రాజీ టైప్ ఇన్‌స్టిట్యూట్‌ల ఎగ్జామినర్లు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The public in general is hereby informed that my client **Guntuboyina Kanaka Durga Sridevi Swaroopa** : Age 45, D/o G.K.D. Raghunadha Rao, D.No.8-60-4 : Flat 401, Satya Sridevi Plaza, Vidyanagar 1st lane, Visakhapatnam-530003 intended to purchase below mentioned schedule property from **Vivek Goyal**, S/o Amit Lal Goyal, Residing at 135, Shiva Enclave, Opp. Lane No.3, Near Guru Ram Rai Public School, Rishikesh, Dehradun, Uttarakhand-24901.

Any person having any rights, title, claim or interest in the said property, by way of sale, inheritance, possession, succession, mortgage, lien, lease, gift or otherwise howsoever in respect of the same, shall intimate the objection in writing to the under signed with supporting documents thereof within (7) days from the date of publication of this notice or else any such claims by anyone shall not be considered and shall be deemed to have been waived and/or abandoned. And, our clients shall proceed to conclude the negotiations and no claims shall be entertained thereafter.

SCHEDULE OF PROPERTY

All that piece of land measuring Extent of 267 Sq.yds or 224.28 Sq.mts., of Survey No.205/1 Part, Plot No.105 and an wide VUDA L.P.No. 15/2000, (as per B.L.P. Plot No. 100) Vellanki Village, Vellanki Grama Panchayat, Anandapuram Mandal, Anandapuram Sub-Registration District, Visakhapatnam District and bounded by: **East :** 33 Feet Road, **South :** Plot No.86 and Vacant Land, **West :** Plot No. 104, **North :** 33 Feet Road, **Measurements :** East to West: 60 Feet or 18.30 mts. North to South: 40 Feet or 12.20 mts.

Visakhapatnam,
Dt: 15-03-2024.

P. SRIDHAR MANIKANTA, ADVOCATE
D.No. 29-2-35, F.No.105, Amaravati Plaza,
Dabagardens,Visakhapatnam-530020. Ph- **7794034264**